బాబోయ్ ..అద్దె ఇళ్లు

- సిద్దిపేటలో పెరిగిన ఇళ్ల కిరాయి
- బెంబేలెత్తుతున్న కిరాయిదారులు
- నిర్వహణ పేరిట అదనపు వసూలు
- నియంత్రించాలని వేడుకోలు



కనకరాజు, వ్యాపారి

ఈ ఫొటోలోని వ్యక్తి మిరుదొడ్డికి చెందిన కనక రాజు. వ్యాపారం నిమిత్తం సిద్దిపేటకు రావాల్సిందే. అంతకు ముందు మిరుదొడ్డి నుంచి సిద్దిపేటకు నిత్యం రాకపోకలు సాగించేవాడు. ప్రయాణ అలసటతోపాటు, కుటుంబానికి దూరంగా ఉంటున్నాననే భావనతో వెంటనే సిద్దిపేటకు కుటుంబంతో మకాం మార్చాలని నిశ్చయించుకున్నాడు. పట్టణంలోని పలు కాలనీల్లో కిరాయి ఇంటి కోసం తిరిగాడు. కానీ, ఇంటి యాజమానులు చెప్పిన షరతులతో అతడికి పట్టపగలే చుక్కలు కనిపించాయి. విద్యుత్, నీటిబిల్లులు, నిర్వహణ చార్జీలు ఇలా అనేక చార్జీల పేరుతో సింగిల్ బెడ్ రూమ్ ఇల్లు నెలకు రూ.6 వేలు చెప్పడంతో విస్తుపోయాడు. ఇది కేవలం కనకరాజుకే కాదు ఇలా నిత్యం పట్టణానికి కొత్తగా వచ్చే వారికి ఎదురవుతున్న అద్దె ఇళ్ల అనుభవం.



సిద్దిపేట పట్టణ ముఖచిత్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణం మొదటి నుంచి వ్యాపారంలో ముందంజలో ఉండటంతో ఇళ్ల కిరాయిలు భారీగానే ఉండేవి. 2016లో సిద్దిపేట జిల్లా కేంద్రంగా అవతరించిన నాటి నుంచి అద్దె ఇళ్ల కిరాయి రోజురోజుకు పెరుగుతూ కిరాయిదారులకు చుక్కలు చూపిస్తోంది. దీంతో వాళ్లు బెంబేలెత్తుతున్నారు. జిల్లా కేంద్రం అవడం, దీంతో పాలనా వ్యవస్థ మొత్తం కేంద్రీకృతం కావడంతో కార్యాలయాలను సిద్దిపేటలో ఏర్పాటు చేశారు. ఉద్యోగులు స్థానికంగా ఉండాల్సి వస్తోంది. వ్యాపారులు కూడా తమ పిల్లలను స్థానిక పాఠశాల్లో చదివిస్తున్నారు. తరచూ అద్దె ఇళ్లు మార్చాలనే ఆలోచన చేయకపోవం ఇంటి యజమానులకు వరంగా మారింది. ఇళ్ల అద్దెను తమ ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. దీనికి అదనంగా విద్యుత్, బోర్ మోటార్ బిల్లులు, నిర్వహణ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. అద్దె ఇళ్లు దొరక్కపోవడంతో కిరాయి ఎక్కువైనా భరించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. గృహ యజమానులు అడిగినంత చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. రాకెట్ వేగంతో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో కిరాయి సామాన్యులు భరించలేనివిధంగా ఉన్నాయి. పట్టణంలో ఖరీదైన గృహాలు ఆదర్శ నగర్, మైత్రివనం, భారత్‌నగర్, శ్రీనగర్ కాలనీ, మహాశక్తి నగర్, ఈ కాలనీలో ఉన్నాయి. ఇక్కడ అద్దె ఇళ్లు దొరకడం గగనమే. ఈ కాలనీలు హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఉండటం, అదేవిధంగా ఇక్కడ వివిధ వ్యాపార కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో అత్యంత ఖరీదైన భవనాలు ఉండటం కిరాయి పెరుగుదలకు ఓ కారణమని స్థానికులు చెబుతున్నారు. దీంతో పాటుగా పట్టణానికి కొత్తగా వచ్చేవారు ఈ ప్రాంతల్లోనే నివసించేందుకు ఆసక్తి చూపుతుండటంతో సొంత ఇళ్లు ఉన్నవారికి కాసుల వర్షం కురుస్తోంది. జిల్లా కేంద్రంలో సింగిల్ బెడ్ రూం ఇంటి కిరాయి రూ.6 నుంచి రూ.10 వేలు, డబుల్ బెడ్ రూం ఇంటి కిరాయి రూ.8 నుండి రూ.15 వేల వరకు ఉన్నాయి. దీంతో సామాన్యులు సిద్దిపేటలో కిరాయికి ఉండాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

నేటి నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కొలువైన శ్రీలక్ష్మీనర్సింహస్వామి



అండాలు స్తంభం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఏటా చైత్ర మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డితో పాటు మహారాష్ట్రలోని ముంబై, బీవండి, షోలాపూర్, కర్ణాటకలోని బలార్ష తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఏప్రిల్ 19వ తేదీ నుంచి 25వ తేదీ కార్యక్రమాలు జరుగుతాయి. స్వామి వారిని ప్రతీరోజూ గ్రామంలో వాహనాల్లో ఊరేగిస్తారు. 19వ తేదీన స్వామివారి తిరుకల్యాణం, 23న శకటోత్సవం, 24వ తేదీన రాత్రి 25వ తేదీ తెల్లవారుజామున రథోత్సవం నిర్వహిస్తారు. కోనేరులో స్నానమాచరించి ఆలయానికి ఉత్తర దిశలో ఉన్న ఏకశిల అండాలు స్తంభానికి 11 ప్రదక్షిణలు చేసి ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సంతానం కలిగిన వారు ఒడిబియ్యం పోసి మొక్కు తీర్చుకొని వెళ్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ ఈఓ పీవీ శర్మ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున అమలులో ఉన్నందున మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో వసతులు సమకూరుస్తున్నారు. కరీంనగర్, సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడవనున్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

సిద్దిపేటజోన్: బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాలపై సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు నిర్మాణాలు కూల్చివేయాలని గురువారం ఆదేశించారు. హైదరాబాద్ రోడ్డు బ్రిడ్జి సమీప కోమటి చెరువు కెనాల్ బఫర్ జోన్‌లో నిర్మించిన రెండు నిర్మాణాలను కూల్చివేశారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టొదని అధికారులు హెచ్చరించారు. కూల్చివేతల్లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది దేవరాజ్, ఎల్లారెడ్డి, ఆర్ఐ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడిషనల్ కలెక్టర్ దంపతుల పూజలు



కోహెడ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ పింగిళి శ్రీనివాస్ రెడ్డి దంపతులు గురువారం సందర్శించారు. పంచాహ్నిక వార్షిక కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్నారు. కలెక్టర్ దంపతులకు ఆలయ అర్చకుడు ప్రసాదరావుశర్మ స్వామివారి శేష వస్త్రము, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమారాచార్యులు, పుష్పేంద్రనాథ మిశ్రా, దర్గారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్లకు సన్మానం



బిల్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: లక్ష్యం మేరకు ఇంటి పన్నులు వసూలు చేసిన మున్సిపల్ బిల్ కలెక్టర్లను గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్ సన్మానించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 86 శాతం ఇంటి పన్నులు వసూలు చేసిన ఆర్ఐ శంకర్, బిల్ కలెక్టర్లు ఎల్లయ్య, రాజమౌళి, నరేష్, సతీష్ లకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఎండలను సైతం లెక్కచేయకుండా బిల్ కలెక్టర్లు ఇంటి పన్నుల వసూలు టార్గెట్ పూర్తి చేయడం అభినందనీయమన్నారు.

ఓటు వజ్రాయుధం



కవాతు చేస్తున్న పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఓటు వజ్రాయుధమని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో గురువారం కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కవాతులో మిరుదొడ్డి, దుబ్బాక, భూంపల్లి ఎస్ఐలు బోయిని పర్శరామ్, గంగరాజు, రవికాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



పరామర్శిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్‌లో ఇటీవల మృతి చెందిన శ్రీరాం నర్సింహులు కుటుంబాన్ని గురువారం పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగం బలరామ్‌గౌడ్, జంగం రమేశ్‌గౌడ్, సర్దార్‌ఖాన్, మొనగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు అర్థరహితం

చిన్నకోడూరు(సిద్దిపేట): మాదిగ జాతిపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వివక్ష చూపుతున్నారని, ఎమ్మార్పీఎస్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల లక్ష్మణ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో మాదిగలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు తమ నాయకుడు మంద కృష్ణ కాంగ్రెస్‌కు మద్దతిచ్చారని, సీఎం ఇప్పటికైనా వాస్తవం గ్రహించి మాదిగ జాతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజ్ఞాపూర్‌లోని ఇండెన్ గ్యాస్ గోదాం వద్ద మాక్ డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గజ్వేల్‌రూరల్: అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల ఇండెన్ గ్యాస్ గోదాం ఆవరణలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్ మాట్లాడుతూ నిప్పుని వినియోగించడంలో నిర్లక్ష్యం వహిస్తే నష్టం తప్పదన్నారు. ఎల్పీజీ సిలిండర్లను భద్రపరిచేటప్పుడు, రవాణా చేసే సమయంలో జాగ్రత్త చర్యలు పాటించాలని, అగ్ని ప్రమాదం జరిగితే దాన్ని నివారించేందుకు అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఎల్పీజీ సిలిండర్ లీకవుతున్నట్లు గుర్తిస్తే వెంటనే దానిని బహిరంగ ప్రదేశానికి తరలించాలన్నారు. అగ్నిప్రమాదం జరిగితే 101 లేదా గజ్వేల్ ఫైర్‌స్టేషన్ 87126 99254 నంబరుకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ అగ్నిమాపక కేంద్ర అధికారి కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి దీనస్థితి

బ్యాటరీ సైకిల్ మంజూరు చేయాలని వినతి



కొప్పునూరి రమేష్

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడకు చెందిన దివ్యాంగుడు కొప్పునూరి రమేష్‌ది నిరుపేద కుటుంబం. పని ఉంటే కర్ర సాయంతో బయటకు వెళ్తున్నాడు. కలెక్టర్ కార్యాలయానికి కాళ్లకు చెప్పులు లేకుండా ఎండలో నడిచివెళ్తుండటం చూసిన గ్రామస్తులు నీడలో కొద్దిసేపు ఉండి వెళ్లాలని సూచించారు. రమేష్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. తండ్రి అంజయ్య కోత మిషన్‌లో పనిచేస్తుండగా, తల్లి కూలిపనులకు వెళ్తుంది. అధికారులు స్పందించి బ్యాటరీతో నడిచే సైకిల్‌ను మంజూరు చేసి, ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశాడు.

సాధ్యంకాని హామీలతో..

కొమురవెల్లి(సిద్దిపేట): సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బుర్గోజు నాగరాజు అన్నారు. గురువారం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌కు మద్దతుగా మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశ భద్రత, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బెజుగామలో మాట్లాడుతున్న డాక్టర్ నరేష్‌బాబు

రాజకీయంగా రాణించాలి

గజ్వేల్‌రూరల్: మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని బెజుగామలో నూతనంగా నిర్మించిన మున్నూరుకాపు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు, విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర మున్నూరుకాపు సంఘం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు మున్నూరు కాపులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహించాయని, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ నిధులను కేటాయించలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నర్సింహులు, బెజుగామ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, కోశాధికారి శ్యామ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, సత్యనారాయణ, సభ్యులు బాలయ్య, భూమయ్య, నర్సింహులు, దేవేందర్, యాదగిరి, వెంకటేష్, నాగభూషణం, కృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

జోరుగా వడ్డీ వ్యాపారం

- సకాలంలో ఇవ్వకపోతే వేధింపులు
- ఆర్థికంగా నష్టపోతున్న సామాన్యులు
- నియంత్రించాలని కోరుతున్న బాధితులు

వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న వడ్డీ వ్యాపారులు అందినకాడికి దండుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు జోరుగా నిర్వహిస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పు తీసుకుంటే అధిక వడ్డీతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన షాపు నిర్వహణకు వడ్డీ వ్యాపారి నుంచి రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. నెలనెలా వడ్డీ చెల్లిస్తున్నాడు. అసలు చెల్లించడంలో కొంత ఆలస్యమైంది, దీంతో అతడి ద్విచక్ర వాహనం అసలు కింద తీసుకెళ్లాడు. ఈ విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందని అతడు మిన్నకుండి పోయాడు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

అధిక వడ్డీతో..

ఎవరికైనా సొమ్ము అవసరం ఉంటే వడ్డీ వ్యాపారి దగ్గరకు వెళ్తే ముందస్తుగానే అధిక వడ్డీ తీసుకుని మిగతాది ఇస్తారు. రోజువారీగా నిర్ణయించిన మేరకు డబ్బులు కట్టాల్సి ఉంటుంది. ఆపదలో కొందరు, అవసరాల కోసం మరికొందరు అప్పు తీసుకున్నందుకు అధిక వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు. గతంలో పట్టణాలకే పరిమితమైన వడ్డీ వ్యాపారం నేడు పల్లెలకు విస్తరించింది. పేద, మధ్య తరగతి, చిరు వ్యాపారాలు చేసుకునే వారు ఎక్కువగా వడ్డీలకు తీసుకుంటారు. వ్యక్తుల ఆదాయం, వ్యాపారం, స్థిరాస్తిని బేరీజు వేసుకుని రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు అప్పులిస్తున్నారు. అధిక వడ్డీ చెల్లించలేక వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి విలవిలలాడుతున్నారు.

పార్టీ కోసం కృషి చేసిన వారిని గుర్తించాలి



చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేసిన నాయకులను గుర్తించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి కోరినట్లు మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసినట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిన వారిని గుర్తించాలన్నారు. 40 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నా దూరం పెడుతున్నారని మంత్రి వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు చెప్పారు. స్పందించిన మంత్రి కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఖజా ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రోడ్లపైనే ధాన్యం ఆరబోత**



చిన్నకోడూరు(సిద్దిపేట): ధాన్యాన్ని ఆరబోయడానికి కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా స్థలం లేకపోవడం, కల్లాల నిర్మాణం చేపట్టకపోవడంతో రైతులు రోడ్లపైనే ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ఈ రోడ్లపై రాకపోకలు సాగించాలంటే జంకుతున్నారు. రాత్రి వేళలో ధాన్యం కుప్పల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ **పదవీ విరమణ సన్మానం**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్ఎం చంద్రయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చంద్రయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమిరె మల్లేశం, మాజీ సర్పంచ్ అన్నాడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పవన్‌సింగ్, పుష్పలత, తిరుపతి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవి, రాజేందర్ పాల్గొన్నారు.

◆ **విద్యుత్ సరఫరా బంద్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో 11 కేవీ విద్యుత్ సరఫరా లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వేములవాడ కమాన్, హనుమాన్‌నగర్, అయ్యప్ప ఆలయం, టూటౌన్ పోలీస్ స్టేషన్, జిల్లా ఆర్టీఏ కార్యాలయం, వడ్డెర కాలనీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మారుతీనగర్, బాలాజీ నగర్, ఇందిరానగర్, ఎన్‌జీవోస్ కాలనీ, శ్రీ ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయం, రూరల్ పోలీస్ స్టేషన్, సుభాష్‌నగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గజ్వేల్ డివిజన్ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. మేదినీపూర్ శివారులో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెలికట్ట, తిమ్మారెడ్డిపల్లి, మేదినీపూర్, తిప్పారం గ్రామాల్లోని 11 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. వెలికట్ట, ఆరెపల్లి, తిమ్మారెడ్డిపల్లి, లకుడారం, కుకునూరుపల్లి, మేదినీపూర్, మంగోల్, ముద్దాపూర్, బొబ్బాయిపల్లి, రామునిపల్లి, తిప్పారం, మాత్‌పల్లి, కోనాయిపల్లి గ్రామాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

◆ **గజ్వేల్ రోటరీ క్లబ్ చేయూత**

ములుగు(గజ్వేల్): మండలంలోని బహిలంపూర్ ఆర్అండ్ఆర్ కాలనీలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాపు కాలిపోయిన ఘటనలో నష్టపోయిన కుటుంబానికి గజ్వేల్ రోటరీక్లబ్ అండగా నిలిచింది. క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు బాధితుడు కుమ్మరి రాజుకు గురువారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సింహారెడ్డి, క్లబ్ ప్రతినిధులు జగదీశ్వర్, లింగారెడ్డి, ఐలయ్య, బాల్‌రాజు, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ పార్టీలో చేరికలు**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అర్బన్ మండల పరిధి బక్రిచెప్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు కొలిమి భిక్షపతి ఆధ్వర్యంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో బక్రిచెప్యాల రెడ్డి సంఘం అధ్యక్షుడు పురుమండ్ల వెంకటరెడ్డి, రెడ్డి సంఘం సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి**

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు ముదిరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం సిద్దన్నపేటలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఖాత, ఘణపూర్, సిద్దన్నపేట, దర్గపల్లి, రాంపూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎన్నికల బాధ్యుడు మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నామినేషన్‌కు తరలిన నాయకులు**

మర్కూక్(గజ్వేల్): మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ వేస్తున్న సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల నాయకులు మెదక్ వెళ్లారు. వెళ్లిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు సింగం సత్తయ్య, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రమేష్, బీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్, నాయకులు పాల్గొన్నారు

◆ **బోనస్ ఇవ్వాలని ఉత్తరాలు**

నంగునూరు(సిద్దిపేట): వడ్లకు బోనస్ డబ్బులు ఇవ్వడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గురువారం రాంపూర్, ముగ్దుంపూర్ రైతులు సీఎం రేవంత్‌రెడ్డిని ఉత్తరాలు రాశారు. ఆయా గ్రామాల్లో ఉత్తరాలతో నిరసన తెలిపి హామీలను అమలు చేయకుంటే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

◆ **కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల గ్రామంలో గురువారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమేష్ గౌడ్ ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

◆ **క్రీడా సామగ్రి అందజేత**

దుబ్బాకటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని దుబ్బాక మున్సిపల్ పరిధి ధర్మాజీపేట ప్రభుత్వ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు నరేష్ అన్నారు. గురువారం హెచ్ఎం శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడమేకాకుండా వారికి తన సొంత ఖర్చుతో క్రీడా సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **శివాలయానికి శంకుస్థాపన**



మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల పరిధి సలాక్‌పూర్ గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శివాలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన కామిడి జయమ్మ, బాల్‌రెడ్డి దంపతుల సహాయంతో ఆలయాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ బాధ్యులు పాల్గొన్నారు.

◆ **కిసాన్‌మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి**

నంగునూరు(సిద్దిపేట): భారతీయ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా సిద్దన్నపేటకు చెందిన పర్కాల తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా నాయకులకు తిరుపతి రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.